# తిరుగు ప్రయాణం

ఇంట్లో గోడవారనున్న మంచంమీద కూలబడింది సుగుణ. అలాంటి పరిస్థితి ఏర్పడుతుందని అంతవరకూ ఏ రకంగానూ ఊహించలేకపోయింది!...కానీ అప్పుడేర్పడింది ఇంకేం చెయ్యడం?...ఏమీ అర్థంకాలేదామెకు.

... అలా మళ్ళీ తనభర్త ఎప్పటికైనా తిరిగొస్తాడనే ఆశ ఉండివున్నట్టయితే సుగుణ అంతనీచమైనపని చేసుండక పోయేది. - కానీ ఆ ఆశ అణుమాత్రమయినా లేకపోడం చేతా, పుట్టింటిలో సవతితల్లి పోరెక్కువవడంచేతా తనాపని చేసిందేగానీ లేకపోతే అంత నీచమైనపని తనెందుకుచేస్తుంది?

--- కనీసం ఏపది పదిహేను సంవత్సరాలకయినా తన భర్త విడుదల అవుతాడనే ఆశుండి ఉన్నట్టుగయితే, అలా బాధలు భరిస్తూ పుట్టింటిలోనే కాలం గడిపుండేది. ఔనుమరి; యావజ్జీవకారాగారశిక్ష విధింపబడినవాళ్ళని అలా మధ్యస్థంలో విడుదలచేస్తారని ఎవరుమాత్రం ఊహించ గలరు? - ఆంధ్రరాష్ట్రావతరణ అనంతరం అలా జైళ్ళన్నీ ఖాళీ అవుతాయని ఎవరుమాత్రం ముందుగా ఊహించ గలరు ? ---

కానీ ఏ వ్యక్తీ ఊహించని విధమైనపరిస్థితేర్పడింది. - సంతోషించడమో విచారించడమో అర్థంకాలేదామెకు!...

--- తనాపని చెయ్యడం తప్పా? హిందూమత

సాంప్రదాయానుసారంగా అవలోకిస్తే తనుచేసినపని తప్పుగానే లోకులు తీర్మానించవచ్చు. - కానీ తన పరిస్థితి తానలా ప్రవర్తించేలా చేసింది. అందుకు తానెంతవరకూ బాధ్యురాలు?

ఏదో రాజకీయాలకు సంబంధించిన ఖూనీ కేసులో తన భర్తకూడా ఓ ముద్దాయి అనే నేరం గాఢంగా మోపడం వల్ల యావజ్జీవకారాగారవాసశిక్ష విధింపబడింది. ఆనాడు భర్త జైలుకుపోతూ - "నేను చచ్చిపోయాననుకో.- నువ్విక ఎలా బ్రతుకుతావో అనేదే నాబెంగ." అని కన్నీరు కారుస్తూ అన్నాడు. పొంగివచ్చే దుఃఖాన్ని దిగమింగుకో లేక అప్పట్లో మరేమీ మాట్లాడలేకపోయింది తను. శిక్షను అమల్లో పెట్టింది ప్రభుత్వం.

స్వంతఆస్తి ఏమీ లేకపోవడంచేత పుట్టింటికి చేరుకోడం. తప్పిస్తే వేరే గత్యంతరంలేకపోవడంచేత తను పుట్టింటికి చేరింది. పోనీ అక్కడయినా సుఖంగావుంటే ఏ అవస్థా లేకపోయేది. సవతితల్లి తనను పెట్టేబాధలు అన్నీ యిన్నీ కావు! పైగా ఊళ్ళోవాళ్ళతో తనశీలం మంచిది కాదని దుష్ప్రచారం చెయ్యడం మొదలెట్టింది. తను అందరి ఆడవాళ్ళలాగా కాక పరాయి మగవారితోనయినా చనువుగా మాట్లాడే అలవాటున్న మనిషి కావడంవల్ల ఆమె ప్రచారానికి చాలా ఫలిత మేర్పడింది!... ఆ ఊళ్లోవున్న ప్రజల్లో ఇంకా బూర్జువాభావాలు పోలేదు! — ఆడవాళ్ళు పరాయి మగవాళ్ళవేపు చూస్తే వాళ్ళు కులటలకిందే జమ?

అలాంటి సంకుచిత మన స్తత్వంగల ఆ ఊరిప్రజల మధ్య తన జీవితం చాలా హాస్యాస్పదంగానూ, నీచంగానూ తయారైంది!... తండ్రి ఉన్నాడన్న మాటేగాని, తన సవతి తల్లి ఎంతచెప్తే అంతే!... అలాంటి వాతావరణంలో ఎన్నాళ్ళిలా బాధలుపడుతూ బ్రతకడం?... ఓనాడు ఆ యింట్లోంచి ప్రయాణమైంది ఈ విశాలవిశ్వంలో తనొక్క_ర్తీ ఆమాత్రంగా బ్రతకలేకపోతుందా అనేదీ మాత్రో!—

బొబ్బిలిలో ఒక రాజుల హోటల్లో వంటకత్తెగా ఉద్యోగం లభ్యమైంది ఆమెకు!...ఆపని చెయ్యడం మొదట్లో కష్టం అనిపించినా రానురాను అలవాట్లోపడింది! రకరకాల మనుష్యులు వస్తూపోతూఉండేవారు!... తానా హోటల్లో ప్రవేశించినదగ్గర్నుంచీ ప్రొప్రైటర్ డబ్బులపెట్టె ఏరోజు కారోజు పూర్తిగా నిండుతోంది!— అందుకు కారణం వంటకాల్లో ఉండే మాధుర్యంకన్నా, తన సౌందర్యంలో ఉన్న ఆకర్షణే అని ఆమె త్వరలోనే గ్రహించింది!... రక రకాల మనశ్ప్రవృత్తులుగల మనుష్యులను తను రోజూ చూస్తూండేది! కొంతమంది తనను అపార్థంచేసుకొని భోంచేస్తూ సరసాల్లోకి దిగుతూఉండేవారు!...శీలం కాపాడు కుంటూ అలాంటివాళ్ళను మాటల్తోనే సంతోషపెట్టేది!...

— కానీ ఆ హోటల్లో నెలవారీని భోంచేస్తూన్న రంగారావు పూర్తిగా ఆమె సోయగానికి దాసుడైపోయాడు. నిజం చెప్పాలంటే ఆమెకోసమనే అతనా హోటల్లో భోంచేస్తూఉండేవాడు!... మొదట్లో ఓ అనుమానదృష్టి తోనే చూసేదు సుగుణని! కానీ ఆమె అలాంటిదికాదన్న

సంగతి త్వరలోనే గ్రహించాడు. ఓనాడు మాటలసందర్భంలో ఆమె నడిగేడు...

... "నీకు పెళ్ళయిందా?" అని.

"అయింది." అని సమాధానమిచ్చింది సుగుణ.

"అయితే మరి నీ భర్తెక్కడ?" అనడిగే డాశ్చర్యంతో రంగారావు.

"ఏమో!... ఒకనాడు నన్ను విడిచిపెట్టి ఎటో వెళ్ళిపోయేడు. చాలా కాలం మళ్ళీ తిరిగి వస్తాడేమోనని చూసేను. కానీ రాలేదు!— బ్రతుకు గడవడం కష్టమై ఈ ఊరొచ్చి ఇలా హోటల్లో చేరేను" అని అబద్ధం చెప్పింది. భర్త ఒక హంతకుడనీ, ఖైదులో ఉన్నాడనీ చెప్పడం యిష్టంలేక అలా చెప్పింది.

"అరే!...నీలాంటి అందాలరాణిని విడిచిపెట్టి యెలా పోగలిగేడు? ఇంతకీ కారణం?"

ఏమని చెప్పడం?—ఒక అబద్ధానికి తోడు ఇంకొన్ని చేర్చాలి!...ఇక అప్పట్లో సమాధానంగా ఏదో ఓ కారణం చెప్పక తప్పదు!— "ఆయన వెళ్ళిపోయినాడే మా ప్రక్కింటి అమ్మాయికూడా మాయమైంది!... ఇంకేం చెప్పమంటారు కారణం?" అనంది. కానీ ఆమాట నోరు జారేక చాలా విచారించింది. అనవసరంగా భర్తపై నేరం ఆరోపించినందుకు!

"ఒట్టి మూర్ఖుడు!" అని రిమార్కు పాస్ చేసేడు రంగారావు.

రంగారావు ఆ రిమార్కు పాసుచేశాక చాలా బాధ

పడిందామె! — తొందరపడి బాగా ఆలోచించకుండా తానలాంటి కారణం కల్పించి చెప్పడంవల్ల, నిజాన్ని కప్పి పుచ్చి, హంతకుడనే అప్రదిష్ట తన భర్తకు కలుగకుండా చెయ్యాలనే సంకల్పంతో ఆడిన అబద్ధంయొక్క ప్రయోజనం లేకుండా పోయిందని అప్పుడు తెలుసుకుంది!— ఆ రకంగా చెప్పిన కారణంవల్ల భర్తకొచ్చే అప్రదిష్టకన్నా నిజకారణం చెప్పినందువల్ల వచ్చే అప్రదిష్టే చాలా నయమని అప్పుడనుకొంది!... ఒక నిజాన్ని కప్పిపుచ్చి, పరువు ప్రతిష్టల్ని కాపాడుకుందామనే ప్రయత్నంలో కొన్ని అబద్ధాలు కల్పించి, ఆ అబద్ధాలవల్ల పరువుప్రతిష్టలని మరో విధంగా కోల్పోతూ వుంటారు. కొంతమందనే విషయాన్ని ఆమె క్రొత్తగా తెలుసుకుంది! ఇక యెలానూ అబద్ధం చెప్పింది కనుక మళ్ళీ ఆ అబద్ధంలో మార్పు తేవడం మంచిది కాదనుకుంది! ఇంతకీ ఆ సంభాషణలో మార్పు తీసుకు రావడం అప్పట్లో మంచిపనని అనుకుంది— "క్షమించండి. ఆ విషయాలనుగురించి ఇక నన్నేమీ అడక్కండి. ఇప్పుడే కాదు; ఎన్నడూ అడగకండి!...ఇంతకీ మీకింకా వివాహం కాలేదా?" అని అడిగింది సుగుణ.

"అయింది!... కానీ అది చచ్చిపోయి ఇప్పటికప్పుడే మూడేళ్ళవుతున్నది. తల్లీ తండ్రీ లేరు నాకు! మా అన్నదమ్ములు నాకు స్కూల్ ఫైనలువరకూ చెప్పించేరు. మరి చెప్పించలేదు. ఏదో అదృష్టం బాగుండి ఈ ఊరు స్కూల్లో ఎటెండరుగా ఉద్యోగం దొరికింది. ఇలా గడిపేస్తున్నాను కాలం. అన్నట్లు నీకూ నాలాగే తల్లీ తండ్రీ లేరా?"

"లేరు!" అని సమాధాన మిచ్చింది; సవతి తల్లీ తండ్రీ ఉన్నారన్న విషయం అతనితో చెప్పడం యిష్టంలేక.

"అయితే నేనే విషయమైనా నిన్ను అడిగితే ఎవ్వరితోనూ సంప్రదించ నవసరంలేకుండానే, నీమట్టుకి నువ్వు స్వంతంగా ఆలోచించుకొని సమాధాన మివ్వాలన్న మాట!..."

"ఔను." అనంది ఆశ్చర్యంతో.

"నిన్నొకటి అడుగుతా?— ఏమీ అనుకోకు!—"

"అడగండి!"

"నీకు భర్త లేడిప్పుడు; నాకు భార్య లేదు!...అంచేత నా భార్యగా నాతో నువ్వు కాపురం చెయ్యడానికి అంగీకరిస్తావా?"

"చాలించండి!... హద్దులు దాటిపోతున్నారు!" అని గిరుక్కున తిరిగి వంటగదిలోకెళ్ళిపోయింది సుగుణ.

రంగారావు ముఖంలో నెత్తురు చుక్క లేదానాడు. నిరాశతో ఇంటిముఖం పట్టేడు!

ఆరాత్రి సుగుణకి నిద్రపట్టలేదు. భర్త బ్రతికుండగానే ఇంకోవ్యక్తితో కాపురం చెయ్యడం సబబయిన పనేనా అని ఆమె ఆలోచన!... భర్త బ్రతికున్నాడన్న మాటేగాని చచ్చినవాడితో సమానమేగా!... తనలా యవ్వనాన్ని అడవిగాచిన వెన్నెలలా చేసుకొని జీవించడంవల్ల ప్రయోజనం!— పోనీ తనలా మిగతా జీవితాన్నంతటినీ శీలం కాపాడుకుంటూ గడపడంవల్ల దేశాని కేమయినా మేలు చేకూరుతుందా? అలాంటిస్థితిలో తనలోని ఆశల్నీ, ఉద్రేకాల్నీ

బలవంతానఅణుచుకొని పతివ్రతలాజీవి స్తేసుఖంఉంటుందా?-బ్రతికిఉండడం దేనికి!—సుఖాలని అనుభవించడానికేగా!—అలాంటప్పుడు ఓ దాసుడులా అంతగా ప్రాధేయపడి అడుగుతున్న రంగారావు నెందుకు కాదనాలి?—తన సోయగానికి రంగారావు చాలావరకూ బానిసయిపోయేడని తనకు బాగా తెలుసు! అంచేత తనెలా చెప్తే అలా వింటాడు. తనను సుఖపెట్టడానికి ఎంతయినా ప్రయత్నిస్తాడు. ఎదురొచ్చే సుఖాన్ని కాలదన్నడం మంచిది కాదు అనిపించింది. ఆ రాత్రంతా చాలా ఆలోచించింది. ఆ మర్నాటి మధ్యాహ్నం రంగారావు భోజనానికొచ్చినప్పుడు తన అంగీకారాన్ని తెలియ జేసింది!

పరమానంద భరితుడయ్యేడు రంగారావు...ఊరు చివరనున్నయిల్లు అద్దెకుతీసుకున్నాడు. హోటలులో పని మానేసింది సుగుణ. ఇద్దరూ ఆ యింట్లో కాపురంపెట్టారు. మొదట్లో రంగారావుని కొంతమంది లోకులు విమర్శించేరు; హోటల్లో పనిచేసేదాన్ని పెళ్ళాడి ఆమెతో కాపురం పెట్టినందుకు... ఆ విమర్శనలను రంగారావేమంతగా లక్ష్యం చెయ్యలేదు.

ఏవిధమైన కలతలూ లేకుండా చాలా అన్యోన్యంగా కాలం గడుపుతున్నారాయిద్దరూ!-కానీ ఖైదీలసందర్శి ఆంధ్రరాష్ట్రావతరణ సంతోషసమయంలో విడిచిపెట్టేస్తారని తెలియగానే ఆమె మనస్సులో తుఫాను చెలరేగింది!...

తనభర్త జైలునుంచి ఎంతో ఆశగా తిరిగొస్తాడు. వస్తూనే తను పుట్టింటి దగ్గరుంటుందేమోననే ఉద్దేశంతో

అక్కడికి వెళ్తాడు. తన విషయమై తనతండ్రి నడుగుతాడు! అతనికిమాత్రం తన ఉనికిగురించి ఏంతెలుసుగనక?!-ఊళ్లో వాళ్ళ నడుగుతాడు!...వాళ్ళకిమాత్రం ఏం తెలుసు గనక? నిరాశతో కృంగి కృషించిపోతాడు! జైలునుంచి విడుదలై వచ్చిన సంతోషం మటుమాయమైపోతుంది! ఎంతగా దుఃఖిస్తాడో యేమిటో?!- ఊహించడానికి శక్తి చాలింది కాదు సుగుణకు!...

...భర్త వచ్చేవేళకి తను పుట్టింటికి చేరుకుంటేనో!- మరి రంగారావుతో తన సంబంధం?!-తనని ఆరాధ్యదేవతగా ప్రేమతో పూజిస్తూన్న రంగారావుని విడిచిపెట్టి వెళ్ళిపోవడం ఎలా?- అలాతను వెళ్ళిపోతే రంగారావు మానసికంగా ఎంతబాధపడతాడో?-మరయితే జైలునుంచి బయటపడి బాహ్యప్రపంచంలోకి రాడేమో అనుకున్నభర్త తిరిగీ వస్తున్నప్పుడు, తను బ్రతికుండీకూడా అలా యింకో పరాయివాడితో కాపురంచేస్తూ ఉండడం సబబైన పనేనా? పోనీ తన భర్తకి తన మీదేమీ ప్రేమ లేకపోయినట్లయితే తనలా రంగారావుతోనే కాలం గడిపెయ్యొచ్చు; కాని తన భర్త చాలామంచి హృదయం గలవాడు. మంచిస్ఫురద్రూపి. తనకు మంచిస్వేచ్ఛనిచ్చి తనకేలోటూ రాకుండా చూసేవాడు! అలాంటి తనభర్తకే తాను నిరాశ చేకూర్చడం సబబైన పనేనా?!...

కానీ యిక తనభర్తను ఆ గ్రామంలోవాళ్ళు గౌరవంగా ఎందుకు చూస్తారు? ఖూనీకోరని నలుగురూ వ్రేలెట్టి చూపరా?!—ఎవరాదరిస్తారు? ఎవరుద్యోగం యిస్తారు?

బ్రతకడం యెలా?;...ఇక ఆపార్టీలతో తిరగడమేగా!—మరి అలాంటివ్యక్తితో తనకేం సుఖం వుంటుంది?—రంగారావుతో హాయిగా ఉంటూన్న తన జీవితానికి చుట్టూ మళ్లీ అనేక సమస్యలు తయారుచేసుకోడం ఎందుకూ?- భర్త విషయం మరచిపోయి హాయిగా రంగారావుదగ్గరే వుండిపోతే!?—

కానీ భర్తని మరచిపోడం ఎలా? వస్తాడుభర్త. తన జాడ తెలీక దుఃఖిస్తాడు చాలా!...ఇంతక్రీ దుఃఖిస్తాడని ఎందుకనుకోవాలి? ఎవడితోనో లేచిపోయుంటుందని అసహ్యించుకుంటాడని ఎందుకనుకోకూడదు?-ఏమో?-అలానే ఊహిస్తాడేమో!...

తనమీద మంచి అభిప్రాయం భర్తకుందని తెలుసు ఆమెకు!-తన ఉనికి తెలియక ఆ అభిప్రాయం మారిపోతుందేమో!...ఎంచేతో ఆమె హృదయం కంపించింది!- తను చేసిన ఆ నీచాతినీచమైన పాడుపనికి భగవంతుడు వికృతమైన శిక్ష విధిస్తాడేమో అనే భయం జనించిందామెలో!—

—ఇంతకీ మరీజన్మలో భర్త జైలునుంచి విడుదలయి బయటకు రాడేమో అనే అభిప్రాయంతోనే రంగారావుతో కాపురానికి అంగీకరించిందేగానీ, తిరిగి ఏనాటికైనా వస్తాడనే ఆశవుంటే ఎందుకలా అంగీకరిస్తుంది?- మరి యిప్పుడు భర్తతిరిగి వచ్చేస్తున్నాడు. అంచేత యిక రంగారావుతో ఉండాల్సిన అవసరం ఏముంది?- తిరిగి తన భర్త సన్నిధికి చేరుకుంటే తప్పేం?- అసలు రంగారావే అతనితో కాపురం చెయ్యమని ప్రాధేయపడ్డాడుగానీ, తనేంప్రాధేయ

పడలేదు. అంతకాలం తనను పోషించకపోతేమాత్రం తనకు గడవదా?-అలా ఆ హోటల్లోనే పనిచేస్తూ కాలం గడిపేయ వచ్చుగా!- ఇంతకీ తనలో ఉండే అందానికి రంగారావు దాసుడయిపోవడంచేత అలా అనురాగంతో ఆదరిస్తున్నాడు. అంతే! అప్పట్లో తనో కురూపిగా ఏ కారణాలవల్లనైనా మారిపోయివుంటే అలానే అనురాగంతో తననుచూస్తాడా?- అనుమానం కలిగింది సుగుణకి!—రంగారావుకి తనమీద ఆ ప్రేమ కలగడానికి కారణం తనలోని సౌందర్యమే అనే నిశ్చయానికి వచ్చింది. మరి అలాంటి రంగారావుని విడిచి పెట్టి, తన హృదయాన్ని ప్రేమించిన భర్తను చేరుకుంటే అందులో దోషం యేముంది?!...

కానీ శీలంచెడిన తను, భర్త అండను చేరడం సబబైన పనేనా?—"ఇన్నాళ్లూ ఎలాబతికేవు?" అని భర్త అడుగుతే ఏమని చెప్పడం?...నిజంచెబితే భర్తతనను అంగీకరిస్తాడా? — అబద్ధంచెబితే భర్తని వంచించినట్లు కాదా?—ఏంచెయ్యడం?—ఆ రాత్రంతా బాగా ఆలోచించింది. సంతోషంతో జైలునుంచి వచ్చేభర్తకు నిరాశ కలుగజెయ్యకూడదని నిశ్చయించుకుంది!!!...

* * *

## 2

ఆ ఊళ్లోవాళ్ళంతా అదో వింతగా చూసేరు సుగుణని!

గుమ్మంలో కాలుపెట్టేసరికి—"మీనాన్న చనిపోతూ నిన్ను తలచుకున్నాడు. ఇప్పుడు కాబోలు రావడానికి నీకు

తీరుబాటైంది!" అంది సవతితల్లి అదోలా సుగుణని చూస్తూ. అందరికీ వినబడేటట్లుగా ఏడవలేదు సుగుణ!

"ఓ వారం రోజుల పాటుంటాను పిన్నీ!" అని అంది సుగుణ బొంగురు పోయిన గొంతుకతో. బాగుండదని ఒప్పుకుందామె. నిజాని కిష్టంలేదు.

ఖైదీలనందరినీ విడిచి అప్పుడే వారం రోజులైంది! సుగుణలో ఆందోళన ప్రారంభమైంది! తనెవరితోనో లేచి పోయిందని మార్గమధ్యస్థంలో భర్తతో ఎవరైనా చెప్పేసుండడంవల్ల రాలేదా?—అనుమానం బలపడిందామెలో!

వారం రోజులుండి వెళ్ళిపోతానన్న సుగుణ ఇంకా వెళ్ళకపోవడం చాలా చికాకనిపించింది ఆమె సవతితల్లి కి!— పొమ్మనలేక పొగబెట్టే పద్ధతి అవలంబించిందామె. అలా ఆమె, లోకులూ అనే మాటల్ని భరిస్తూ ఓ నెలరోజులపాటు ఆ యింట్లోనే ఉంది, భర్తవస్తాడనే ఆశతో సుగుణ!–ఆమెలో ఆశ సన్నగిల్లింది. – ఆ ఊర్లో తనింక ఉండడం కష్టం. – ఎక్కడికిపోవడం? – మనుష్యులు లేనిచోటుకుపోతే మనశ్శాంతి ఉంటుందనుకుంది. – ప్రయాణానికి సిద్ధమైంది!!...

—:o:—